# సత్యవాక్కు

## క్రైస్తవ మాస పత్రిక

THE WORD OF TRUTH

## మీకొక సదవకాశము!

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి" యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొంది యున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 20 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్య మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. 15/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంధాలయాన్ని తెరవండి!!

**SATYA VANI**
(P.O. Box 80) Seshagiri Rao St.
KAKINADA-533 004

గమనిక :- మీరు M.O. పంపునప్పుడు, మాకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మీ అడ్రసులో మార్పు కలిగినప్పుడు మీ సత్యవాక్య నంబరును మాకు తెలియజేయండి. ఇది అత్యవసరం !!


Razan Electric Press, Kakinada.

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.O. Box 80, KAKINADA, A.P 533 001.

Editor : J.C. CHOATE

Managing Editor : JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 11 | జూలై 1991 | సంచిక 12

# సంపాదకీయము

## పది ఆజ్ఞలు నాడు - నేడు

## (The Ten Commandments Yesterday and Today)

గ్రంథములోని పది ఆజ్ఞలను గూర్చి, అవి యిప్పటికిని అమలులో ఉన్నవా లేవా అనే అంశమును గూర్చి కొన్ని శతాబ్దముల నుండి నేటి వరకు వివాదంగానే ఉంటూ వచ్చినది. ఎవరయినను బైబిలును క్షుణ్ణంగా అర్థం చేసుకోగలిగితే అట్టివారికి పాతనిబంధన ఒక చట్టముగా కొట్టివేయబడినదనియు, దాని స్థానే క్రొత్త నిబంధన చట్టము క్రీస్తు మరణముతో అమలులోనికి వచ్చినదనియు గ్రహింపగలరు. ప్రభుని మరణము ఒక చట్టాన్ని చెరిపివేయుటే కాకుండ ఆయన రక్తము చిందించుట ద్వారా ఒక క్రొత్త చట్టము ప్రవేశ పెట్టబడెను. హెబ్రీయులకు వ్రాసిన పత్రిక 8, 9, 10 అధ్యాయములు చదివినచో పాత చట్టము కొట్టివేయబడకుండ క్రొత్త చట్టమునకు తావు లేదను సంగతిని తెలిసికొనగలరు.

అనగా, పాతనిబంధన ఇక లేదని, అది దేవుని పరిశుద్ధ లేఖనము

కాదని అందుమా ? అట్లనరాదు. పాతనిబంధన ఒక చట్టముగా ఇక వర్తించదుగాని, అది ఖచ్చితముగా దేవుని వాక్యమే. చదువుటకును అందుండి నేటి మానవుడు అనేక మంచి సంగతులను, పాఠములను తెలిసికొనుటకు ఉపయోగకరమై యున్నది. పాతనిబంధన మనకు ఉదాహరణముగాను మాదిరిగాను ఉండుటకై వ్రాయబడియున్నదని అపొస్తలుడు పౌలు చెప్పెను. "వారు ఆశించిన ప్రకారము మనము చెడ్డవాటిని ఆశించకుండునట్లు ఈ సంగతులు దృష్టాంతములుగా ఉన్నవి" (1 కొరింధి 10 : 16). పౌలు రోమీయులకు ఈ విధముగా వ్రాసెను: "ఏలయనగా ఓర్పువలనను, లేఖనముల వలన ఆదరణవలనను మనకు నిరీక్షణ కలుగుటకై పూర్వమందు వ్రాయబడిన వన్నియు మనకు బోధ కలుగు నిమిత్తము వ్రాయబడి యున్నవి" (రోమా 15 : 4).

పాత నిబంధన చట్టము ఇక మీదట అమలులో లేదనగా అందున్న పది ఆజ్ఞలు అమలులో లేవని అర్థమా? అట్లు కానేరదు. పది ఆజ్ఞలు ఇప్పుడు చట్టబద్ధంగా అమలులో లేవనునది సర్వివాదాంశం. అయితే యేసుక్రీస్తు, క్రొత్త నిబంధన గ్రంథకర్తలు ఒక్క విశ్రాంతి దినమును మినహాయించి ఆ ఆజ్ఞ లన్నిటిని నేటి మానవుని కొరకు క్రొత్త నిబంధన చట్టములో పొందుపరచిరి. ఆ విశ్రాంతి దినమునకు బదులుగా వారములో మొదటి రోజును ఆరాధన దినముగా తీర్మానించిరి. "ఆదివారమున మేము రొట్టె విరుచుటకు కూడినప్పుడు" (అ. కార్య. 20:7). క్రొత్త నిబంధనలోని ప్రతి పేజి క్రీస్తుయొక్క క్రొత్త చట్టమును ప్రత్యక్షపరచుచున్నది. ఈ చట్టములోని అంశములు పాత నిబంధనను బట్టి లేక అనుసరించి ఏర్పరచబడినవి కావు. క్రీస్తు మరియు క్రొత్తనిబంధన రచయితలు నరహత్య చేయవద్దు, దొంగతనము చేయవద్దు, వ్యభిచరింపవద్దు అను తదితర ఆజ్ఞ

లను ఇందులో చేర్చిరి; ఏలయనగా యిటువంటి ఆజ్ఞలు ప్రతి నైతిక చట్టానికి అవుసరం. ఉదాహరణకు ఏ దేశమునైనను తన ప్రస్తుత రాజ్యాంగ చట్టమును మార్చి క్రొత్తది రూపొందించుటకు అధికారము కలిగియుండును. ఆ క్రొత్త చట్టములో అవసరమనుకుంటే పాత చట్టమునుంచి కొన్ని సిద్ధాంతములను, అంశములను లేక అధికరణములను చేర్చవచ్చును. అయితే ప్రస్తుత ప్రజలు ఈ క్రొత్త చట్టాన్ని అనుసరించే పాలింపబడతారు గాని, ఎంత మాత్రము పాత చట్టానికి విలువ నివ్వరు. ఈ సిద్ధాంతములు, ఆజ్ఞలు, స్వేచ్ఛాయుత అధికరణములు పాతచట్టమునుండి పొందుటచేత కాదుగాని, ఇవి ప్రతి రాజ్యాంగ నిర్మాణ చట్టమునకు అవసరమయినవిగా ఎంచబడుచున్నవి. ఇదియునుగాక ఒక దేశముయొక్క రాజ్యాంగ చట్టములో మరియొక రాజ్యాంగ చట్టములోని ఆజ్ఞలు, అంశములు లాంటివి కూడ చేర్చబడి యుండవచ్చు; అంతమాత్రముచేత పరాయి దేశముయొక్క చట్టమును అనుసరిస్తున్నామనియు, పాలింపబడుచున్నామనియు అర్థము ఎంతమాత్రమును కాదు. ప్రస్తుత కాలమాన పరిస్థితులను బట్టి, అవసరతలను బట్టి చాల దేశముల రాజ్యాంగ చట్టములలో ఒకే విధమయిన కొన్ని ఆజ్ఞలు, అంశములు యుండుట జరుగుచున్నది.

మరియొకసారి పాత నిబంధన చట్టములోని పది ఆజ్ఞలను, క్రీస్తు మరియు క్రొత్త నిబంధన గ్రంథకర్తలు చెప్పిన ఆజ్ఞలను ప్రక్క ప్రక్కన పెట్టి పరిశీలించుదము.

మొదటి అజ్ఞ : "నేనుతప్ప వేరొక దేవుడు నీకు ఉండ కూడదు" (నిర్గమ 20:3). క్రొత్త నిబంధనలో పౌలు యిట్లు చెప్పెను "అందరికీ తండ్రియైన దేవుడు ఒకడే. ఆయన అందరికి పైగా ఉన్న వాడై అందరిలోను వ్యాపించి అందరిలో ఉన్నాడు" (ఎఫెసి 4:6).

రెండవ ఆజ్ఞ : "దేనిరూపము నయినను విగ్రహమునయినన

నీవు చేసికొనకూడదు. వాటికి సాగిలపడకూడదు. వాటిని పూజింపకూడదు" (నిర్గమ 20:4). యోహాను ఈ విధముగా వ్రాసెను. "చిన్న పిల్లలారా, విగ్రహముల జోలికి పోకుండ జాగ్రత్తగా ఉండుడి" (1 యోహాను 5:21).

మూడవ ఆజ్ఞ : "నీ దేవుడైన యెహోవా నామమును వ్యర్థముగా నుచ్చరింపకూడదు" (నిర్గమ 20:7). పౌలు మరి యెక్కువగా స్పందింపబడినవాడై ఇట్లనెను. "మిమ్ము హింసించువారిని దీవించుడి, దీవించుడిగాని శపింపవద్దు" (రోమా 12:14). క్రీస్తు యిట్లనెను. "మరియు—నీవు అప్రమాణము చేయక నీ ప్రమాణములను ప్రభువునకు చెల్లింపవలెనని పూర్వికులతో చెప్పబడినమాట మీరు విన్నారుగదా, నేను మీతో చెప్పునదేమనగా—ఎంతమాత్రము ఒట్టు పెట్టుకొనవద్దు; ఆకాశము తోడనవద్దు అది ఆయన సింహాసనము; భూమి తోడనవద్దు అది ఆయన పాదపీఠము; యెరూషలేము తోడనవద్దు అది మహారాజు పట్టణము; నీ తలతోడనవద్దు, నీవు ఒక వెండ్రుకనైనను తెలుపుగాగాని నలుపుగాగాని చేయలేవు మీ మాట అవునంటే అవును కాదంటే కాదు అని యుండవలెను" (మత్తయి 5:33-37).

నాల్గవ ఆజ్ఞ : "విశ్రాంతి దినమును పరిశుద్ధ దినముగా ఆచరించుటకు జ్ఞాపకముంచుకొనుము" (నిర్గమ 20 : 8). ఇంతకుముందు మనము చెప్పుకొనియున్న ప్రకారము ఈ విశ్రాంతి దినము అనగా వారములో ఏడవరోజు శనివారమునకు బదులుగా ఆదివారమును అనగా వారములో మొదటి రోజును పరిశుద్ధ దినముగా మార్చుట జరిగినది. పౌలును, త్రోయలోని క్రైస్తవులందరును ఆదివారమును పరిశుద్ధ దినముగా ఆచరించుటకు కూడిరని లేఖనము చెప్పుచున్నది. "ఆదివారమున మేము రొట్టె విరుచుటకు కూడినప్పుడు, పౌలు మరు

నాడు వెళ్ళనై యుండి వారితో ప్రసంగించుచు అర్ధరాత్రివరకు విస్తరించి మాటలాడు చుండెను" (అ. కార్య. 20:7).

ఐదవ ఆజ్ఞ : "నీ దేవుడైన యెహోవా నీ కనుగ్రహించిన దేశములో నీవు దీర్ఘాయుష్మంతుడవగునట్లు నీ తండ్రిని నీ తల్లిని సన్మానింపుము" (నిర్గమ 20 : 12). పౌలు ఇట్లనెను. "పిల్లలారా, ప్రభువునందు మీ తల్లిదండ్రులకు విధేయులై యుండుడి; ఇది ధర్మమే. నీకు మేలుకలుగునట్లు నీ తండ్రిని, నీ తల్లిని సన్మానింపుము, అప్పుడు నీవు భూమిమీద దీర్ఘాయుష్మంతుడవగుదువు. ఇది వాగ్దానముతో కూడిన ఆజ్ఞలలో మొదటిది" (ఎఫెసీ 6:1-3).

ఆరవ ఆజ్ఞ : "నరహత్య చేయకూడదు" (నిర్గమ 20:13). క్రీస్తు హత్యనుగూర్చి ఖండించుటయే గాక యిట్లనెను. "తన సహోదరునిమీద కోపపడు ప్రతివాడు విమర్శకులోనగును; తన సహోదరుని చూచి వ్యర్థుడా అని చెప్పువాడు మహాసభకు లోనగును, ద్రోహి అని చెప్పువాడు నరకాగ్నికి లోనగును" (మత్తయి 5:22). అంతేకాక "తన సహోదరుని ద్వేషించువాడు నరహంతకుడు; ఏ నరహంతకుని యందును నిత్యజీవముండదని మీరెరుగుదురు" అని 1 యోహాను 3:15 లో యోహాను చెప్పెను. ద్వేషము, కలహము, క్రోధము, కక్షలు యివన్నియు శరీర కార్యములలో నరహత్యతో సమానమని, అట్టివారు దేవుని రాజ్యమును స్వతంత్రించుకొనరని పౌలు స్పష్టము చేసెను (గలతి 5:19-21).

ఏడవ ఆజ్ఞ : "వ్యభిచరింపకూడదు" (నిర్గమ 20:14). యేసు క్రీస్తు వ్యభిచారాన్ని ఖండించడమే కాకుండ హృదయాంతరాళలో జరుగుచున్న వ్యభిచారమును సహితము ఖండించెను. ఆయన ఇట్లనెను "వ్యభిచారము చేయవద్దని చెప్పబడిన మాట మీరు విన్నారు గదా;

నేను మీతో చెప్పున దేమనగా—ఒక స్త్రీని మోహపు చూపుతో చూచు ప్రతివాడు అప్పుడే తన హృదయమందు ఆమెతో వ్యభిచారము చేసినవాడగును" (మత్తయి 5:27, 28). మరియు "వ్యభిచారము నిమిత్తమే తప్ప తన భార్యను విడనాడి మరియొక తెను పెండ్లి చేసుకొనువాడు వ్యభిచారము చేయుచున్నాడనియు, విడనాడబడిన దానిని పెండ్లి చేసుకొనువాడు వ్యభిచారము చేయుచున్నాడనియు మీతో చెప్పుచున్నానని వారితో అనెను" (మత్తయి 19:9). అపొస్తలు పౌలు 1 కొరింథి 6 : 9, 10 వచనములలోను గలతి 5 : 19-21 లోను వ్యభిచారము చేయువారు దేవుని రాజ్యమునకు వారసులు కానేకారని ఖండితముగా చెప్పెను.

ఎనిమిదవ ఆజ్ఞ : "దొంగిలకూడదు" (నిర్గమ 20 : 15). దొంగతనమును, దోపిడితనమును ఖండిస్తు క్రొత్తనిబంధన గ్రంథములో చాల లేఖన భాగములు గలవు. పౌలు చెప్పిన ఒక మంచి బోధను చూద్దాం, "అపవాదికి చోటియ్యకుడి; దొంగిలువాడు యిక మీదట దొంగిలక అక్కరగలవానికి పంచిపెట్టుటకు వీలుకలుగు నిమిత్తము తన చేతులతో మంచి పనిచేయుచు కష్టపడవలెను" (ఎఫెసి 4 : 27, 28).

తొమ్మిదవ ఆజ్ఞ : "నీ పొరుగువాని మీద అబద్ధ సాక్ష్యము పలుకకూడదు" (నిర్గమ 20 : 16). ఈ అబద్ధ సాక్ష్యమునుగూర్చి పౌలు వయోభేధమును బట్టి హెచ్చరికలు చేసెను. వృద్ధ స్త్రీలను గూర్చి "ఆలాగుననే వృద్ధ స్త్రీలు కొండెగత్తెలును, మిగుల మద్యపానాసక్తులునై యుండక ప్రవర్తనయందు భయభక్తులు గలవారై యుండవలెననియు" (తీతు 2 : 3). సంఘ పెద్దలను గూర్చి—"ఇద్దరు ముగ్గురు సాక్షులుంటేనే గాని పెద్దమీద దోషారోపణ అంగీకరింపకుము" (1 తిమోతి 5:19). క్రీస్తును సిలువకు అప్పగించుటకు సరయిన

సాక్ష్యాధారములు లేక అబద్ధ సాక్ష్యములు చెప్పుటకు సిద్ధపడిరని లేఖనములు రుజువు చేయుచున్నవి. "ప్రధాన యాజకులును, మహా సభ వారందరును, యేసును చంపవలెనని ఆయనకు విరోధముగా అబద్ధ సాక్ష్యము వెదకుచుండిరి కాని, అబద్ధ సాక్షులనేకులు వచ్చినను సాక్ష్యమేమియు దొరకలేదు" (మత్తయి 26:59).

పదవ ఆజ్ఞ : "నీ పొరుగువాని యిల్లు ఆశింపకూడదు—నీ పొరుగువానిదగు దేనినైనను ఆశింపకూడదు" (నిర్గమ 20:17). పొరుగు వానిది ఆశించుట అనగా అది స్వార్థబుద్ధిని, ధనాపేక్షను, అన్యాయాన్ని తెలియజేయును. అన్యాయస్తులు—దోచుకొను వారయినను దేవుని రాజ్యమునకు వారసులు కానేరరని 1 కొరింథి 6:9, 10 లో పౌలు వివరించెను. నిందారహితుడు, ధనాపేక్ష లేనివాడు మాత్రము సంఘ అధ్యక్ష పదవికి అర్హుడని 1 తిమోతి 3:2, 3 లో చెప్పెను. పౌలు తిమోతిని యిట్లు హెచ్చరించెను "ఎందుకనగా ధనాపేక్ష సమస్త కీడులకు మూలము, కొందరు దానిని ఆశించి విశ్వాసమునుండి తొలగిపోయి నానా బాధలతో తమ్మును తామే పొడుచుకొనిరి" (1 తిమోతి 6:10).

పైన చెప్పబడిన దంతయు చూడగా, పది ఆజ్ఞలతో కూడి యున్న పాత నిబంధన చట్టము ఇకమీదట చెల్లనేరదని గ్రహింప గలము. అట్లు చెప్పుటవలన ఆనాడు నిషేధింపబడిన ఆజ్ఞలనుండి మనము విడుదల పొంది యున్నామనియు, వాటిని అనుసరించవలసిన పని లేదనియు అర్థము కాదు. అయితే అంతకంటె శ్రేష్ఠమైన, పరిష్టమైన ఆజ్ఞలు కలిగియున్న క్రొత్తనిబంధనలోని క్రీస్తుయొక్క చట్టము మరింత అనుసరయోగ్యమై యున్నదని గ్రహించగలము. ఈ క్రొత్త నిబంధన చట్టములో వట్టి క్రియలు మాత్రమే నిషేధింపబడలేదుగాని, హృదయ తలంపులలో పుట్టు ఆలోచనలనుకూడ నిషేధించుట జరిగినది.

కావున ఇప్పుడు మనమందరము క్రీస్తుయొక్క క్రొత్త నిబంధన చట్టముక్రింద ఉన్నామని గుర్తుంచుకొనవలెను. అంతేకాక మన ప్రభువును రక్షకుడునైన క్రీస్తునందు గొప్ప నిరీక్షణ, వాగ్దానముతో కూడియున్న స్వాతంత్ర్యము నిచ్చు సంపూర్ణ నియమము కలిగి యున్నామని గ్రహించవలయును (యాకోబు 1:25).

—సహో. జె. సి. ఛోట్.

---

## వెయ్యేండ్ల పాలనను గూర్చి నీ ఆలోచనేమోకాని....

ప్రభువైన యేసు మొదటిసారి మానవుడుగా అవతరించి, పేద వాడుగా పెరిగి, తన స్వకీయులచే తృణీకరింపబడి, కడకు నేరస్థుడైనట్లు కఠోరమైన మరణం అనుభవించాడు. మూడవ దినాన పునరుత్థానుడై గలిలయులలో కొందరికి కనబడి పరమునకు వెళ్ళారు. కాని ఆయన రెండవమారు ఆర్భాటంతోను, ప్రధాన దూత శబ్దంతోను, దేవుని బూరతోను పరలోకంనుండి దిగి వస్తారు. అప్పుడు ఆయన భూమిమీద వెయ్యేండ్ల పరిపాలన చేస్తారని కొందరు నమ్ముతారు. ఇలాటి నమ్మకాలతో కలసియున్న యింక కొన్ని విషయాలను చూద్దాం.

### కొన్ని అపోహలు

ఆయన రెండవ రాకడలో ప్రత్యక్షమైనప్పుడు మృతులలో తన వారిని మాత్రమే లేపుకుంటాడట; దీన్ని మొదటి పునరుత్థాన మంటారట! అదేసమయంలో భూమిమీద సజీవులుగానున్న తన వారిని మహిమ దేహాలుగా మార్చుకుంటారట. ఈ రెండు రకాలైన జనులు ఆయనను "మధ్యాకాశం"లో కలుసుకుంటారట. అక్కడ వారు ఆయనతో "ఏడేండ్లు" పెండ్లి విందులో పాలుపొందుతారట.

ఆ కాలంలో ప్రభువునకు సంబంధించని భూజనులు "ఏడేండ్ల శ్రమల్లో ఉంటారట". "అయ్యో శ్రమలు భయంకర శ్రమలు, మహా శ్రమలు" అంటూ జనములను భయపెట్టే మాటలను చదువరి వినియుండలేదా! వినకపోతే అలాంటి శ్రమలొస్తాయని వారి నమ్మకం. అప్పటిలో కడమ మృతులు—"అంటే ప్రభువుకు చెందని మృతులట. వారప్పుడు లేపబడతారట".

ఈ వెయ్యేండ్ల పరిపాలనకు ముందో, వెనకో - మొత్తానికి ఎప్పుడో, 666వ ముద్ర వేయబడాలట. అసలు రాకడకే ముందైతే ఆ 666వ ముద్ర ఎప్పుడు ప్రారంభమౌతుందో! ఒకవేళ ఈ 666 వ ముద్ర, ఈ ఏడేండ్ల శ్రమ కాలంలోనే అయితే వారి ఆలోచన ప్రకారం ప్రభువుకు సంబంధించిన జనులు మధ్యాకాశంలో ఏడేండ్ల పెండ్లి విందులో వుంటారు గనుక వారికీ ఈ ముద్రకు సంబంధ ముంత కూడదు. అప్పటిలో భూమిమీద విడువబడే జనులందరు సాతాను సంబంధులే అయ్యుండాలి గనుక ఆ ముద్ర ఎవడికీ ప్రత్యేకముగా వేయనవసరం లేదుగదా! అయినా ఆ 666 వ ముద్రను ఎలాగో తమ విశ్వాసంలోనికి ప్రవేశపెట్టాలి! అక్షరార్థంగా ఆ ముద్ర వేయించుకొన్న వారికే రేషన్ వగైరాలట! లేకపోతే లేదట!! వీటికి ఆధారాలు ఎక్కడో! వినటానికి వింతగా వుంటాయి గనుక వింటారు.

మధ్యాకాశంలో ఏడేండ్లు పెండ్లివిందు అయిపోతుందట, మహిమ దేహం ధరించి ఆకాశంలోనికి కనురెప్పపాటులో వెళ్ళగలిగిన తన ప్రజలతో ప్రభువైన యేసు ఆ పెండ్లివిందు ముగించుకొని భూమిమీదికి దిగివస్తారట. ఆయన ఇశ్రాయేలు దేశానికి వచ్చి, యెరూషలేమును కేంద్రంగా చేసికొని, భూమిమీద భౌతిక రాజ్యపాలన సాగిస్తారట, ఈ పాలనకు ప్రారంభంలోనే సాతానును బంధించివేస్తారట. ఆదాము మొదలు రెండవ రాకడవరకు ఉన్న తన వారందరితో ఈ వెయ్యేండ్ల

పాలనను చేస్తారట మరి వారందరికి స్థలమెక్కడో! దీనికి ముందున్న సాతాను జనులు ఎక్కడికి పోతారో తెలియదు. అయితే యూదు లందరు ఆయన పక్షముగా చేరతారట, యెరూషలేం దేవాలయం తిరిగి కట్టబడుతుందట !

అప్పటిలో సాతాను ప్రజలకు ఏలిక ఎవరై యుంటారో! ఏది ఎలాగున్న ప్రభువైన యేసు పాలనలో మాత్రం—తోడేలు గొర్రె పిల్లయొద్ద వాసముచేయడం, చిరుతపులి మేకపిల్లయొద్ద పండుకొనడం; యెద్దు మేసినట్టు సింహం గడ్డి మేయడం, పసిబాలుడు నాగుపాము పుట్టయొద్ద ఆటలాడటం, పాలుకుడుచు బిడ్డ మిడినాగు కంటిపాపను తన వ్రేలితో తాకడం-వంటి పనులు జరుగుతాయట! మరి సాతాను జనులమధ్య పరిస్థితులెలాగుంటాయో!

ఆ వెయ్యేండ్లు గడిచాక అపవాది విడిపింపబడతాడట. వాడు వచ్చి జనులను తన పక్షంగా చేర్చుకొని, క్రీస్తుతోను ఆయన ప్రజల తోను "హెర్మెగెద్దోన్" అనే యుద్ధం చేస్తాడట. సాతాను జనం ఓడింపబడతారట. చివరిగా సాతాను సంబంధులై మృతులైన వారిని ఆయన బ్రతికిస్తాడట. అప్పుడు అంత్య తీర్పు జరుగుతుందట. గొర్రెల వాడు మేకలలోనుండి గొర్రెలను వేరు చేసినట్టు ఆయన తనవారిని కుడివైపున చేర్చుకొని నిత్యజీవానికి పంపుతూ, తన ఎడమవైపున ఉన్న వారిని అపవాదికిని వాని దూతలకును సిద్ధపరచిన నిత్యాగ్నిలోనికి పంపుతారట. కొందరు ఈ కూర్పును కొంచెం వ్యత్యాసంగా కూర్చినా, మొత్తంమీద వెయ్యేండ్ల పరిపాలనను నమ్మేవారు సంగతులను యిలా నమ్ముతారు, ఈ నమ్మకానికి బైబిల్లో ఆధారం లేదు.

## వాటి ప్రారంభం

ఇలాటి తప్పుడు బోధను ప్రారంభించినవాడు ఫ్రిగియాలోని

హీరాపోలిస్ సంఘంలో అధ్యక్షుడైన పేపియస్ అనేవాడట. చరిత్రకారుడైన ఇసూబియస్ పేపియస్‌ను గూర్చి యిలా వ్రాసాడు: "వింతైన ఉపమానాలను పుక్కిటి పురాణాలను అతడు (పేపియస్) అంగీకరించేవాడు. వాటిలో మృతుల పునరుత్థానంతరువాత వెయ్యేండ్లు క్రీస్తు భౌతిక రాజ్యాన్ని భూమిమీద ఏర్పాటు చేస్తాడనేది ఒకటి. అపొస్తలుల రచనల్లో ఆత్మసంబంధంగాను, అలంకారంగాను ఉన్న వాటిని అతడు అపార్థం చేసుకొని యిలాంటి భావానికి వచ్చాడని నాకు (ఇసూబియస్‌కు) తోస్తుంది. తన రచనలను బట్టి అతడు (పేపియస్) అంత జ్ఞానం గలవాడు కాడని తేలుతుంది. ప్రాచీనకాలపు వాడని అతనిపై ఆధారపడిన అనేకమంది క్రైస్తవ రచయితలు అదే అభిప్రాయాన్ని కలిగియున్నారు—" (Eusebius quoted by Maltox The Eternal Kingdom).

వాస్తవాలు యిలా వుండగా క్రీస్తు వెలుబడిని గూర్చిన సత్యమేమి! వెయ్యేండ్లు పరిపాలన లేదా! ఉంటే, అది ఎవరికి సంబంధించినది! క్రీస్తుకా? తన ప్రజలకా! వగైరా సంగతులను పరిష్కారంగా తెలిసికోడానికి ప్రయత్నిద్దాం. లేఖనాలను పరిశీలిద్దాం. నమ్మదగిన బోధను గట్టిగా చేపట్టుదాం. పుక్కిటి పురాణాలనుండి, వింతైన ఉపమానాల నుండి తొలగిపోదాం. నిత్యజీవానికై నిరీక్షించుదాం. సరేనా! అయితే చూడు.

## దీర్ఘకాల అలంకారం వెయ్యి

వెయ్యి (1000) అనేది అలంకార ప్రయోగమే: "నీ గురించే మాట్లాడు కొంటున్నాం; అంతలోనే వొచ్చావ్; నీకు నూరేండ్లు" అనే ప్రయోగం నేటి సాంఘిక సహజీవనంలో వినలేదా! అలా అనడంలో- అతడు నూరుకంటే ఎక్కువ యేండ్లు బ్రతుకుతాడని కాదు; లేక అతడు అంతకాలం బ్రతుకుతాడని కాదు. "నీకు నూరేండ్లు

యుష్షు" అనేది దీర్ఘకాల జీవితాన్ని సూచించే కోర్కెగా నేడు ఎలా ప్రయోగింపబడుతుందో, అలాగే లేఖనాల్లో వెయ్యి అనే ప్రయోగం చేయబడింది. కావాలంటే ఈ క్రింది లేఖన భావాలను చూడు.

1. "నన్ను ప్రేమించి నా ఆజ్ఞలు గైకొనువారిని వెయ్యి తర తరముల వరకు కరుణించువాడనై యున్నాను" (నిర్గమ 20 : 6). వెయ్యి తరాలకంటే ఆయన ఎక్కువ కరుణించడని దాని భావం కాదు.

2. అడవి మృగము లన్నియు వేయి కొండలమీద పశువు లన్నియు నావేగదా! (కీర్త 50:10). తక్కిన కొండలమీద పశువులకు సృష్టికర్త మరొకడని దాని అర్థం కాదు. "భూమియు దాని సంపూర్ణతయు లోకమును దాని నివాసులును యెహోవావే!" (కీర్త 24:1).

3. "నీ దృష్టికి వేయి సంవత్సరములు గతించిన నిన్నటివలె నున్నవి, రాత్రి యందలి యొక జాము వలెనున్నవి" (కీర్త 90:4). వేయి సంవత్సరముల ఎన్నిక ఎంతో! ఒక రోజు! లేక రాత్రిలో ఒక జామా!

4. "ప్రియులారా, ఒక సంగతి మరచిపోకుడి. ఏమనగా ప్రభువు దృష్టికి ఒక దినము వెయ్యి సంవత్సరముల వలెను, వెయ్యి సంవత్సరములు ఒక దినము వలెను ఉన్నవి" (2 పేతు 3:8). వేయి "అనేది యిక్కడ దీర్ఘకాలం అనే భావంతోనే ప్రయోగింపబడింది

5. "...మరియు క్రూర మృగమునైనను దాని ప్రతిమనైనను నమస్కారము చేయక తమనొసళ్ళయందుగాని చేతులయందుగాని దాని ముద్ర వేయించుకొనని వారిని, యేసు నిమిత్తమై తామిచ్చిన సాక్ష్యము నిమిత్తమును దేవుని వాక్యము నిమిత్తమును శిరచ్ఛేదము చేయబడిన వారి ఆత్మలను చూచితిని. వారు బ్రతికినవారై వెయ్యి సంవత్సర

ములు క్రీస్తుతో కూడ రాజ్యముచేసిరి"...(ప్రకటన 20:4-6). ఇక్కడ "వెయ్యి" అనే మాట పట్టుకొని 999+1 సంవత్సరాలని భావం చెప్పడం తప్పు కాదా!

"వెయ్యేండ్ల పాలకులకు" ఈ లేఖనభాగమే ఆధారం. వెయ్యేండ్ల పాలనకొరకు ఈ లేఖనభాగాన్ని వారు అక్షరార్థంగా, వ్యాఖ్యానించగోరితే, దానిలో పాలు పొందేదెవరో తిరిగి చదివిచూడు: (1) క్రూరమృగమునకైనను దాని ప్రతిమకైనను నమస్కారము చేయనివారు (2) తమ నొసళ్ళయందుగాని చేతులయందుగాని దాని ముద్ర వేయించుకొననివారు. (3) యేసు నిమిత్తమై తామిచ్చిన సాక్ష్యము నిమిత్తమును, దేవుని వాక్యము నిమిత్తమును శిరచ్ఛేదనం చేయబడినవారు—"వారు బ్రతికినవారై వెయ్యి సంవత్సరములు క్రీస్తుతో కూడ రాజ్యము చేసిరి" అని వ్రాయబడియుంది. క్రీస్తు వెయ్యేండ్లు రాజ్యం చేస్తాడని లేదుసుమా! క్రీస్తు రాజ్యపాలనలో వారు వెయ్యేండ్లు ఆయనతో కూడ రాజ్యం చేసిరని మాత్రమే అక్కడ వ్రాయబడి యుంది. గనుక వెయ్యేండ్ల పాలన క్రీస్తు పాలనలో భాగమై యుండాలేగాని క్రీస్తే వెయ్యేండ్ల పాలన చేస్తాడని లేదు. కావాలంటే మళ్ళా చూడు—"వారు బ్రతికినవారై వెయ్యి సంవత్సరములు క్రీస్తుతోకూడ రాజ్యము చేసిరి". ఇది వారిని గూర్చి క్రీస్తునుగూర్చి కాదు.

అక్షరార్థమైతే లేఖనం యిలా వుండగా వెయ్యేండ్ల పరిపాలనలో అందరం ఉంటామనే భావం ఎక్కడనుండి వచ్చిందో? పైగా ఈ వెయ్యేండ్ల పరిపాలన క్రీస్తు రెండవ రాకడ తరువాతనే అనేదానికి ఆధారం లేఖనాల్లో ఎక్కడుందో! అది చాలదన్నట్టు, భూమిమీద క్రీస్తు భౌతిక రాజ్యపాలన చేస్తాడని అక్కడ లేదే! భౌతిక రాజ్య పాలనను ఈ "వెయ్యేండ్ల పాలకులు" ప్రభువైన క్రీస్తుకొరకు ఎక్కడనుండి తెచ్చారో!!

# ప్రవచనాధారం

యిర్మీయా ప్రవచన భావాన్ని బట్టి, ప్రభువైన యేసు అప్పుడు యిప్పుడే కాదు, ఆయన ఎన్నడూ భౌతిక రాజ్యపాలన చేయడానికి వీలులేదు. ఎలాగంటావేమో! క్రీస్తు శరీరాన్ని బట్టి దావీదు సంతతి (రోమా 1:4). యెకోన్యా (యిర్మీయా 24:1) లేక కోన్యా (యిర్మీయా 22:24) అనేవాడు దావీదు సంతతికి చెంది, అతని సింహాసనంమీద కూర్చున్న యూదా దేశపు రాజు. కోన్యా అనే అతనికి యూదాలో దావీదు సింహాసనంమీద కూర్చుండే సంతానం లేదట!! ఈ మాట యూదా దేశంతోనే మహోన్నతుడు తెలియ జేసారు. జాగ్రత్తగా చూడు.

తండ్రి యొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామమున అన్నట్టు—"దేశమా, దేశమా, దేశమా యెహోవా మాట వినుము. యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు-సంతానహీనుడనియు, అతని దినములలో వర్ధిల్లనివాడనియు ఈ మనుష్యుని గూర్చి వ్రాయుడి. అతని సంతానములో ఎవడును వర్ధిల్లడు. వారిలో ఎవడును దావీదు సింహాసనమందు కూర్చుండడు; ఇకమీదట ఎవడును యూదాలో రాజుగా వుండడు" (యిర్మీయా 22:28-30).

(యె) కోన్యా సంతతివాడెవడును ఇక మీదట యూదాలో రాజుగా వుండడు! ఈ మాటకు ప్రభువైన యేసుకు సంబంధమేమి? అని అడుగుతావేమో! శరీరమును బట్టి ప్రభువైన యేసు యెకోన్యా సంతతివాడే (మత్తయి 1:1, 11 చూడు). యిర్మీయా ప్రవచనం ప్రభువైన యేసుకు తెలియకుండ వచ్చింది కాదు (మీకా 5:2) ఆయన ఈ ప్రవచనము ఎరిగినవాడు గనుకనే, భౌతిక రాజ్య సింహాసనాన్ని నిరాకరించాడు (యోహాను 6 : 15). తన మరణానికి ముందే సొలొమోనునాటి వైభవాన్ని జ్ఞాపకంచేసికొని ఆ రూపంలో భౌతిక

రాజ్యాన్ని స్థాపిస్తాడని భావించిన అపొస్తలుల భావాన్ని ఆయన రద్దు పరచారు (మత్తయి 20:20-28). ఆయన తీర్పు తీర్చబడిన సమయంలో తన రాజ్యం ఈలోక సంబంధమైనది కాదని అది యిహ సంబంధమైనది కాదని తన్ను ప్రశ్నించిన పిలాతుకు వివరించాడు (యోహాను 18:36). అయినా ఆయన రాజేనట! గనుక ఆయన పునరుత్థానుడైన తరువాత—"ప్రభువా ఈ కాలమందు ఇశ్రాయేలునకు రాజ్యమును మరల అనుగ్రహించెదవా?" అని తన అపొస్తలులు అడిగితే, వారు ఎదురు చూచిన రూపంలో సమాధానం చెప్పకుండానే ఆరోహణు డయ్యారు (అపొ. 1:6-11).

## రాజైన యాజకుడు

క్రీస్తు మెల్కీసెదెకు క్రమము చొప్పున యాజకుడు (హెబ్రీ 7:17). అంటేఆయన మెల్కీసెదెకువలె (ఆది 14:18) రాజై యాజకత్వం చేస్తాడు; లేక యాజకుడై రాజ్యపాలన చేస్తాడు (జెకర్యా 6:12-13; యిర్మియా 23:5). ఆయన దేవునికి మానవులకు మధ్యవర్తి (1 తిమో 2:5). గనుక దేవునిపట్ల దైవముగా ఆయన ధర్మవిధులను మానవుల అంతరంగాల్లో నిలిపి నడిపించుటకు రాజై పాలన చేస్తాడు; మానవాళి పట్ల మన బలహీనతలలో సహానుభవము గలవాడుగా (హెబ్రీ 4:15-16), తండ్రియైన దేవుని ఎదుట యాజకత్వం చేస్తారు. అయితే ధర్మశాస్త్ర సంబంధులైన యాజకులు ఆ కాలంలో ఉన్నారు గనుక "ఆయన భూమిమీద ఉన్నయెడల యాజకుడై యుండడు (హెబ్రీ 8 : 4). ఆయన ఎప్పుడు యాజకుడై యుంటాడో అప్పుడే రాజై యుంటాడు గనుక ఆయన భూమిమీద ఉన్నయెడల రాజై యుండడని వేరుగా చెప్పనవసరం లేదు."

అందువలన "మనుష్యుడు కాక ప్రభువే స్థాపించిన నిజమైన గుడారమునకు పరిచారకుడై యుండి, పరలోకమందు మహామహుని

సింహాసనమునకు కుడిపార్శ్వమున ఆసీనుడాయెను" (హెబ్రీ 8 : 2). ఏలయనగా, "—నేను నీ శత్రువులను నీ పాదములకు పాదపీఠముగా చేయువరకు నా కుడిపార్శ్వమున కూర్చుండుము" (కీర్త 110:1) అని తండ్రియైన దేవుడు ప్రభువైన యేసుకు సెలవిచ్చారు. పైగా, యెహోవా నీ పరిపాలన దండమును సీయోనులోనుండి సాగజేయుచున్నాడు. నీ శత్రువులమధ్యను నీవు పరిపాలన చేయుము...... మెల్కీసెదెకు క్రమముచొప్పున నీవు నిరంతరము యాజకుడవై యుందువని యెహోవా ప్రమాణము చేసియున్నాడు. ఆయన మాట తప్పనివాడు (కీర్త 110:2-4).

ఆరోహణుడై తేజోమయుడైన క్రీస్తుకు ఈ ఏర్పాట్లు జరుగుచుండగా (దాని 7 : 12-13; ఫిలిప్పీ 2 : 8-11), క్రొత్త నిబంధనను అనుసరించి, ఆత్మసంబంధమైన దేవుని రాజ్యాన్ని ప్రారంభించడానికి యెరూషలేములో వేచియున్న అపొస్తలుల (మీదికి) యొద్దకు పరిశుద్ధాత్మ పంపబడ్డాడు (అపొ. 2 : 1-5). పరిశుద్ధాత్మ యొక్క అపూర్వమైన రాక వేలకొలది కనులను అపొస్తలులున్న చోటికి ఆకర్షించింది. ప్రభువు వాగ్దానాన్ని బట్టి (మత్తయి 16:18-19), పరిశుద్ధాత్మ పూర్ణుడైన పేతురు సువార్త ప్రకటన ద్వారా పరలోకరాజ్య ద్వారాలను తెరిచాడు. అప్పుడే సీయోనులోనుండి ధర్మశాస్త్రం (క్రొత్తనిబంధన) యెరూషలేములోనుండి యెహోవా వాక్కు బయలుదేరింది (యెషయా 2 : 1-2)

ప్రభువైన యేసుయొక్క మరణం, సమాధి, పునరుత్థానాలలో యిమిడియున్న దేవుని ఏర్పాటు విన్నవారికి అర్థమయ్యింది. గనుక వారు తమ పాపపు స్థితిని గుర్తించి, దానిచేసినందుకు మనస్సున నొచ్చుకొన్నవారై, తమ జీవిత నడవడికను దిద్దుకొనగోరి, వారు ఏమిచేయాలో అపొస్తలుల నడిగారు. తిరిగి పేతురే సమాధాన మిస్తూ,

మీారు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీారు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు ..ఇంకను అనేక విధములైన మాటలతో సాక్ష్యమిచ్చి - మూర్ఖులగు ఈ తరము వారికి వేరై రక్షణ పొందుడని వారిని హెచ్చరించాడు" (అపొ. 2 : 38-41). పేతురు తన ప్రసంగంలో కీర్తనలు 110:1 ని కోట్ చేసి, "మీారు సిలువ వేసిన యీ యేసునే దేవుడు ప్రభువుగాను క్రీస్తుగాను నియమించెను..." (అపొ. 2:36) అని తెలిపితే, ఆయన అధికారము నంగీకరించినవారు బాప్తిస్మము పొందిరి (41).

## సువార్తద్వారా ప్రవేశం

నీటిమూలంగాను, ఆత్మమూలంగాను జన్మించినవారే దేవుని రాజ్యంలో ప్రవేశిస్తారని ప్రభువు ముందుగానే సూచించారు గదా! (యోహాను 3:5). సువార్త ప్రకటన వలన పేతురు పరలోక రాజ్యపు ద్వారాలు తెరువగా, ప్రభువైన యేసు ఆధిపత్యానికి లోబడుట ద్వారా 3000 మంది ప్రవేశించారు. "అంధకార సంబంధమైన అధికారం నుండి విడుదలచేసి తాను ప్రేమించిన తన కుమారుని యొక్క రాజ్యనివాసులనుగా" పరమ తండ్రి వారిని చేసారు (కొలస్స 1:13).

సువార్తద్వారా చీకటిలోనుండి ఆశ్చర్యకరమైన తన వెలుగులోనికి పిలువబడి, నీటిమూలముగాను, ఆత్మమూలముగాను జన్మించిన ద్విజులు, క్రీస్తువలె రాజులైన యాజక సమూహముగాను, పరిశుద్ధమైన జనముగాను, దేవుని సొత్తయిన ప్రజలుగాను అంగీకరింపబడ్డారు (1 పేతు 2:9). గత జీవితంలో అపరాధముల చేతను పాపముల చేతను చచ్చినవారై యుండగా వారు క్రీస్తుతో పాటు బ్రతికింపబడ్డారు గనుక (ఎఫెసీ 2:1-2), వారే మొదటి పునరుత్థానములో పాల్గొన్నవారై యున్నారు. ఒకవేళ వీరిలో కొందరు దేవుని వాక్యము నిమిత్తము

శిరచ్ఛేదనమే చేయబడ్డారనుకో. వారు ఆత్మలో సజీవులే గాని చచ్చిన వారు కారు. గనుక శరీరంతో జీవించుచున్నవారేమి, శరీరం కాల్చి వేయబడ్డవారేమి ఆత్మలో వారందరు సజీవులుగనే క్రీస్తు ప్రభువు యొక్క ప్రజలుగా ఆయన రాజ్యపాలనలో పాలుగలవారై యుంటారు (ప్రక 20:4).

అలా పెంతెకోస్తు దినమున ఆరంభమైన క్రీస్తు పాలన ఎంత కాలం కొనసాగింపబడాలో లేఖనాల్లో సూచింపబడింది. "తన శత్రువుల నందరిని తన పాదములక్రింద ఉంచువరకు ఆయన రాజ్యపాలన చేయుచుండవలెను (1 కొరింథీ 15 : 22). ఆయన తన శత్రువులను జయించుకొంటూ వస్తూంటే, "కడపట నశింపజేయబడు శత్రువు మరణం (1 కొరింథీ 15:26). మరి ఈ మరణం నశింపజేయబడే దెప్పుడు? విజయమందు మరణం మ్రింగివేయబడునప్పుడే! అది రెండవ రాకడలో!! పెంతెకోస్తు దినాన దేవుని రాజ్యంలో ప్రవేశించిన శిశువులు, ప్రభువులా వుండుటకు అన్ని విషయములలో ఎదిగి (రోమా 8:30) రెండవ రాకడలో దేవుని రాజ్యాన్ని స్వతంత్రించుకొంటారు (మత్తయి 25:41).

## రెండవ రాకడలో జరిగేది

అయితే సహోదరులారా, నేను చెప్పునదేమనగా రక్త మాంసములు దేవుని రాజ్యమును స్వతంత్రించుకొననేరవు; క్షయత అక్షయతను స్వతంత్రించుకొనదు. ఇదిగో మీకు ఒక మర్మము తెలుపుచున్నాను; మన మందరము నిద్రించముగాని నిమిషములో, ఒక రెప్పపాటున, కడబూర మ్రోగగనే మనమందరము మార్పు పొందుదుము. బూర మ్రోగును; అప్పుడు మృతులు అక్షయులుగా లేపబడుదురు. మనము మార్పు పొందుదుము. క్షయమైన యీ శరీరము అక్షయతను ధరించుకొనవలసి యున్నది. మర్త్యమైన యీ శరీరము అమర్త్యతను ధరించుకొనవలసి యున్నది. ఈ క్షయమైనది అక్షయతను ధరించుకొని

నప్పుడు ఈ మర్త్యమైనది అమర్త్యతను ధరించుకొనినప్పుడు - విజయ
మందు మరణము మ్రింగివేయబడెను అను వాక్యము నెరవేరును"
(1 కొరింథీ 15:50-54). గనుక ప్రభువైన క్రీస్తు తన రెండవ రాకడ
వరకు ఆత్మసంబంధులకు తన ప్రజలను ఏలుచు యాజకత్వం జరిగించుచు
ఉండాలి!!

ప్రభువైన యేసుయొక్క రెండవ రాకడ తరువాత ఆయన
రాజ్యపాలన చేయరు. ఆయన రాకడ సమయంలోనే తీర్పు జరుగు
తుంది. ఆయన తన విరోధులకు భయంకరుడుగా ఉంటారు. "ప్రభు
వైన యేసు తన ప్రభావమును కనుపరచు దూతలతో కూడ పరలోక
మునుండి అగ్ని జ్వాలలలో ప్రత్యక్షమై, దేవుని నెరుగనివారికిని, మన
ప్రభువైన యేసు సువార్తకు లోబడనివారికిని ప్రతిదండన చేస్తారు
(2 థెస్స 1 : 6-8). ఆ దినమున తన పరిశుద్ధులయందు మహిమపరచ
బడుటకును, విశ్వసించిన వారియందు ప్రశంసింపబడుటకును, ప్రభువు
వచ్చినప్పుడు అట్టివారు ఆయన సముఖమునుండియు ఆయన ప్రభావ
మందలి మహిమనుండియు పారద్రోలబడి నిత్యనాశనమను దండన
పొందుదురు" (2 థెస్స 1:9-10). ఆ సమయంలోనే సమాధుల్లోవున్న
వారుకూడ లేపబడతారు (యోహాను 5:28).

అదే సమయంలో తన ప్రజలకు ఘనమైన స్వాగత మియ్య
బడుతుంది. "ఆర్భాటముతోను, ప్రధాన దూత శబ్దముతోను, దేవుని
బూరతోను పరలోకమునుండి ప్రభువు దిగివచ్చును; క్రీస్తునందుండి
మృతులైనవారు మొదట లేతురు. ఆ మీదట సజీవులమై నిలిచి
యుండు మనము వారితో కూడ ప్రభువును ఎదుర్కొనుటకు (మధ్యా
కాశానికి కాదు) ఆకాశమండలమునకు మేఘముల మీద కొనిపోబడు
దుము. (ఏడేండ్లు పెండ్లివిందు తరువాత భూమిమీద వెయ్యేండ్ల
పాలనకు వస్తాము అనేది లేదు) కాగా సదాకాలము ప్రభువుతో కూడ
ఉందుము" (1 థెస్స 4:16-17).

"ఆదామునందు అందరు ఏలాగు మృతి పొందుచున్నారో, ఆలాగుననే క్రీస్తునందు అందరు బ్రతికింప బడుదురు" (నిత్యజీవమునకో లేక నిందపాలగుటకో! దేనికో!). ప్రతివాడును తనతన వరుసలోనే బ్రతికింపబడును (అపరాధములచేతను పాపములచేతను చచ్చిన నీవు నేడు దేవుని కుమారుని శబ్దం వింటివా! బ్రతికింపబడతావు. గనుక మొదటి పునరుత్థానములో పాలుగల పరిశుద్ధుడవు, యాజకుడవై యుంటావు (యోహాను 5:25). ఇలా బ్రతికింపబడక నీవు సమాధికి చేరితేకూడ, తీర్పుకై బ్రతికింపబడేది ఖాయం (యోహాను 5 : 28). ఇది తథ్యం అనడానికి క్రీస్తు పునరుత్థానమే రుజువు (అపొ. 17 : 31). ఇట్టి పునరుత్థానానికి ప్రథమ ఫలము క్రీస్తు.

తరువాత క్రీస్తు వచ్చినప్పుడు (ఆగమనమందు) ఆయన వారు బ్రతికింపబడుదురు. "అటు తరువాత ఆయన సమస్తమైన ఆధిపత్యమును, సమస్తమైన అధికారమును బలమును కొట్టివేసి తన తండ్రియైన దేవునికి రాజ్యము అప్పగించును; అప్పుడు అంతము వచ్చును" (1 కొరింథీ 15:24). అంటే అంతవరకు దేవునికిని ఆయన ప్రజలకును సమన్వయం కుదిర్చడానికి మధ్యవర్తిగా నిలిచి, తన దేవుని సముఖములో నిలువగలవారైనట్లు తన ప్రజలను నడిపించిన తరువాత యేసు మధ్యవర్తిగా తొలగి, దేవుని నిత్య రాజ్యాన్ని స్వతంత్రించుకొనేలా జనులనూ, వారిని ఉన్నపాటున అంగీకరించేలా దేవుని పరిచయంచేసి ఆయన తానే తండ్రికి లోబడి యుంటాడు (1 కొరింథీ 15:25-28).

ఇవి రోజులు తరబడి జరిగే పనులు కావు, ఇవన్నీ ఒకేసారి జరిగే పనులే. సృష్టికూడా యిలాటి శుభసమయంకొరకు మిగుల ఆశతో తేరిచూస్తూ కనిపెడుతుంది (రోమా 8:20). దేవుని కుమారులు తమ మహిమ స్వాస్థ్యమును అనుభవింపబోవునప్పుడు సృష్టికి కూడ విడుదల లభిస్తుంది. అది అగ్నిలోనే దహింపబడి లయమైపోతుంది

(2 పేతు 3:8-12). భౌతికమైనదేదీ యికను ఉండదు. గనుక రెండవ రాకడ తరువాత భౌతికమైన రాజ్యాన్ని ప్రభువైన యేసు భూమి మీద ఏర్పాటు చేస్తారనేది సత్యదూరం. అది అపొస్తలుల లేఖనాలను అపార్థం చేసికొనడం వల్ల ఏర్పడ్డ తప్పు అభిప్రాయమే!

ఆయన రాజ్యం నేడు భూమిమీద ఉంది (ప్రకటన 1 : 9). ఆ నిశ్చలమైన రాజ్యమును పొంది దైవకృపను కలిగియుండునట్లు, క్రీస్తు యేసు ఆధిపత్యాన్ని అంగీకరించినవాడవై నీటిమూలముగాను ఆత్మమూలముగాను జన్మించి, ఆయన రాజ్యాంగ చట్టమైన క్రొత్త నిబంధనలో నిలిచియుండి శాశ్వత రాజ్యమును స్వతంత్రించుకొనుటకు సిద్ధపడవలసిందిగా ప్రేమతో ఆహ్వానిస్తున్నాం. సంగతులను విని మనోనేత్రములు వెలిగించబడినవాడవై సత్యాన్ని అంగీకరించు మనస్సును మహామహుడే నీకు ప్రసాదించును గాక! ఆమెన్.

—G. దేవాదానం, మద్రాసు-12.

---

## వినుటయే గాని విశ్వసించుటలేదు

## ( Hearing but Not Believing )

బోధకులు సువార్తను ప్రకటించినప్పటికిని వినినవారు స్పందించకపోవుట కొన్నిసార్లు వారికి అనుభవమే. పాపులు సువార్తకు విధేయులగుటకు, సభ్యులు విశ్వాసముతో ఎదుగునట్లు క్రీస్తు బోధను వెంబడించుటకు వారు అంగీకరించుటలేదు. వేరువేరు గృహాలలో ఒకే బోధను బోధించినప్పుడు ఒక కుటుంబము విధేయత చూపితే మరొక కుటుంబము తిరస్కరించుట బోధకునికి ఆశ్చర్యము కలిగించుచున్నది. ఒకే సువార్త బోధించినప్పుడు అందరు ఒకే విధముగ స్పందించుట

లేదు. రక్షణమార్గమును ప్రకటించి అందరినీ మార్పుచేయుట సాధ్యముకాక పోవచ్చును.

సువార్తను వినువారందరు విధేయులు కారను సంగతి మనము తెలిసికొని గ్రహించవలెను. మార్పు నొందుటలో వినువాని పాత్ర కూడ ఉన్నది. మత్త 13:1-23 లో చెప్పబడిన ఉపమానమందు ఈ విషయము స్పష్టము చేయబడినది. యెషయా చెప్పిన మాటలను యేసు జ్ఞాపకము చేయుచు వారు వినుటమట్టుకు విందురుగాని గ్రహింపనే గ్రహింపరు అని చెప్పెను. ఇశ్రాయేలీయులు పౌలు బోధకు స్పందించని సమయంలో అనేకసార్లు తన పనిలో యెషయా ప్రవచనములను గుర్తు చేసెను (అ.కా. 28:25-29, రోమా 10:16-21).

దేవుని వాక్యము వినుటవలన విశ్వాసము కలుగునను మాట యదార్థము (రోమా 10 : 17). సువార్త వినిన అనేక సమయాల్లో దానికి ఫలితంగా విధేయత కనపడదు. ఎందువలన? దీనికి జవాబు ఇశ్రాయేలీయులు వాగ్దాన దేశమునకు చేరలేకపోవుట ఉదాహరణగా చెప్పవచ్చును. హెబ్రీ లేఖకుడు ఇశ్రాయేలీయులకు యివ్వబడిన అనేక సంతోషకరమైన విషయములను గూర్చి వ్రాసెను. "వారికి ప్రకటింపబడినట్లు మనకును సువార్త ప్రకటింపబడెను, గాని వారు వినినవారితో విశ్వాంసము గలవారై కలిసియుండలేదు." (హెబ్రీ 4 : 1-3). అవిశ్వాసము వలన అవిధేయతవలన వారు విశ్రాంతిలో ప్రవేశింపలేదను సంగతిని మనము నేర్చుకొనియున్నాము (హెబ్రీ 3 : 18-19). వారు వినలేదా? విన్నారు గాని వినిన వారిలో విశ్వాసము లేకుండ దేవుని కిష్టుడై యుండుట అసాధ్యము (హెబ్రీ 11:6).

సువార్తను వినువాడు గొప్ప బాధ్యతను కలిగియున్నాడు. సువార్తను హృదయములోనికి చేర్చుకొనే సంసిద్ధతను కలిగియుండక

పోయినయెడల విశ్వాసమునకు చోటులేదు. తినిన ఆహారము జీర్ణము కానియెడల శరీరమునకు ప్రయోజనము కానేరదు. క్రీస్తు సువార్త విశ్వాసముతో కలిసినప్పుడే వ్యక్తిగతముగా ఒకనికి ప్రయోజనకారి కాగలదు. పాపుల కివ్వబడిన హెచ్చరిక యిదే: "లోపల నాటబడి మీ ఆత్మలను రక్షించుటకు శక్తిగల వాక్యమును సాత్వికముతో అంగీకరించుడి" (యాకోబు 1:21).

—రేమండ్ ఇల్లియట్.

## బైబిలును తెలిసికొనుట
## (Knowing the Bible)

బైబిలు బోధించువాడు దానిని బాగుగా తెలిసికొనినవాడై యుండవలెను. అందలి బోధలను విషయములను పూర్తిగా అర్థము చేసికొని స్పష్టముగా బోధించవలసి యున్నది. వాక్యము బోధించే వానిగా నుండగోరువాడు అన్నియు బాగుగా ఎరిగినవాడై (ఉపాధ్యాయుడై) యుండవలెను. మనస్సులోను హృదయములోను బైబిలును వ్రాసికొనినవాడై యుండవలెను. ఇతరులు తెలిసికొనగలుగునట్లు దానిని బోధించగలవాడై యుండి అది అతని వ్రేలి కొనలపై నుండవలెను.

దీని భావ మేమనగా బోధకుడు తీవ్ర పఠనము చేసి ఆలోచించి సిద్ధపడి యుండవలెను. తన పఠనమును కొనసాగించవలెను. అతడు పఠించునప్పుడు అతనికి గ్రంథాలయమునందలి వ్యాఖ్యానములు, నిఘంటువులు మరియు ఇతర సమాచారములు అవసరమగును. అతని పఠనము అతనిని గ్రంథాలయమునకు తీసికొని వెళ్ళును.

బోధకుడు తను బోధించుచున్న లేఖనభాగము యొక్క సందర్భమును బాగుగా ఎరిగినవాడై యుండి దానికి అనుబంధముగానున్న మిగిలిన లేఖనభాగములపై తన దృష్టిని కేంద్రీకరించవలసి యున్నది.

ఒక లేఖనభాగము యొక్క అర్థము మరొక లేఖనభాగమునందు లభించును. మంచి బైబిలుజ్ఞానము అబద్ధ బోధకులకు మనలను దూరముగా నుంచును.

ప్రతి దినము బోధకునికి ఎన్నో చేయవలసిన పనులున్నాయి. పరిమితమైన కాలము మన ముందున్నది. మనము ఏమిచేయవలెనో నిర్ణయించుకొని కాలమును సద్వినియోగము చేసికొనవలెను.

నేను మరల చెప్పునదేమనగా బైబిలునుగూర్చి తెలిసికొనకుండ ఏ మనుష్యుడు సువార్తను ప్రకటించలేడు. ఈ వ్యాసము చదువుచున్న ప్రతి ఒక్కరూ, వాక్యమును బాగుగా పఠించి దాని ప్రాముఖ్యతను తెలియజేసే గురిని కలిగియుండాలి. నీకున్న సమయమును వేరొక పనికి వెచ్చించి నీ సమయమును వృథా చేయకుండ ఉండుటయే నీ జీవిత ప్రథమ కర్తవ్యము.

—టామ్ కెల్టన్.

---

## సంక్షిప్త వార్తలు

### Bro. M. సత్యానందంగారు మృతి

రాజమండ్రి క్రీస్తు సంఘ సేవకులు బ్రదర్ M. సత్యానందంగారు జూన్ 28వ తేదీ ఆదివారం మధ్యాహ్నం గుండెపోటువల్ల మరణించారు. తన యౌవనదశలోనే క్రీస్తును ఆయన సంఘాన్ని గుర్తించి, క్రీస్తు రాజ్యవ్యాప్తి కొరకు అహోరాత్రులు కృషిసల్పిన యౌవన యోధుడు సత్యానందంగారు. ఆంధ్రప్రదేశ్ లో పలుచోట్ల బహిరంగ సభలలో చక్కటి శైలిలో బైబిలు మర్మములను ప్రజలకు వినసొంపుగా వివరించేవారు సత్యానందంగారు. సత్యవాక్యమును సరిగా విభజిస్తూ అనేక ప్రశ్నలకు సునాయాసంగా బైబిలునుండి జవాబీయగల నేర్పరి. అట్టి యౌవన బైబిలు పండితుడు మనమధ్య లేకపోవడం

క్రీస్తు సంఘాలకు తీరని లోటు. ఆయన విడచివెళ్ళిన సతీమణికి, ఒకే ఒక్క కుమారునికి ఆదరణ లభించునట్లు ప్రార్థించుదాం. మన పిలుపు వచ్చువరకు సత్యానందంగారివలె ప్రభువు పనిలో నిమగ్నులమై యుందాం. ఆయన విడచివెళ్ళిన స్థానిక సంఘం, ప్రభువు పని మరింత బలపడునట్లు ప్రార్థించుదాం.

* *

1991 జనవరి నెలలో ప్రారంభించబడిన డెల్టా ఏరియా బోధకుల సమావేశము ప్రతి నెలా ఆయా ప్రాంతములలో జరుగుచూ క్రీస్తు కొరకు, ఆయన సంఘాభివృద్ధి కొరకు గొప్ప పనిని జరిగించుచున్నది. రాత్రి సమయంలో బోధకులు మరియు స్థానిక క్రీస్తు సంఘము కలసి బహిరంగ సువార్త సభ జరిగించుట వలన అనేకులు క్రీస్తు బోధకు విధేయులగుచున్నారు. జూన్ నెలవరకు సమావేశాలు జరిగిన గ్రామాలలో 25 మంది బాప్తిస్మము పొందిరి. స్థానిక సంఘములు క్షేమాభివృద్ధి నొందుచున్నవి. క్రీస్తు సంఘము లేని గ్రామాలలో క్రొత్తగా పని ప్రారంభింపబడుచున్నది. నూతనంగా ప్రార్థనా మందిరాలు నిర్మింపబడు చున్నవి. క్షేమాభివృద్ధికి దోహదంచేసే విషయాలు చర్చింపబడు చున్నవి.

జూన్ నెల సమావేశము ది 20-6-91 గురువారం గొల్ల విల్లిలో అత్యానందకరంగా జరిగింది. "అబద్ధ బోధలను సమర్థవంతంగా ఎదుర్కొని క్రొత్త నిబంధన సంఘము యొక్క స్పష్టమైన స్వరూపాన్ని ప్రజల ముందుకు తీసుకొని వెళ్ళుట ఎట్లు?" అను విషయము చర్చింపబడెను. సోదరులు ఇ.కె.వి. ప్రసాదరావుగారు, బి. యోహానుగారు, వి. చిన్నయ్యగారు, డి. సామ్యేలుగారు, జె. రెడ్డి స్టీవెన్‌గారు మరియు మిగిలిన బోధకులు చర్చలో పాల్గొనిరి. జాషువా కూటంగారు అనేక సమస్యలకు చక్కని సమాధానము నిచ్చిరి.

ఆ దినమున కూటమునకు ముందు 7 గురు బాప్తిస్మము పొందిరి. రాత్రి కూటమునకు వందలాది మంది పరిసర గ్రామములనుండి వచ్చి దేవుని వర్తమానమును విని ఆనందించిరి. "పాతాళమందు ప్రార్థన

కూటము" అనే క్రొత్త అంశాన్ని (లూకా 16:19-31) సహో. జాషువా కూటంగారు హృదయానికి హత్తుకొనే విధముగా బోధించిరి. ఈ ప్రసంగము ఆ ప్రాంతములో గొప్ప సంచలనము కలిగించెను. వెంటనే అర్ధరాత్రి యిద్దరు బాప్తిస్మము పొందిరి. జాషువా కూటంగారు బోధించిన విధము అనేక మంది విద్యావంతులను, విద్యార్థులను మరియు వ్యాపారులను ఆకర్షించెను. మొత్తం ఆ దినమున 9 మంది బాప్తిస్మము పొందిరి.

సోదరులు పాల్ కూటంగారు గొల్లవిల్లిలో సువార్త పనిని కొనసాగించుచున్నారు. ఆంధ్రప్రదేశ మందలి గొప్ప బోధకులలో పాల్ కూటంగారు ఒకరు. అబద్ధ బోధలను సవాలు చేయుచు సుమారు 60 అంశాలపై వేలకొలది కరపత్రికలు ముద్రించి దేవుని మహిమార్థమైన పనిని జరిగించుచున్నారు.

పాల్ కూటంగారి వందన సమర్పణతో రాత్రి కూటము ముగిసెను. కూటము అనంతరము బోధకులు మరియు కూటమునకు హాజరైన ప్రజలు ఆనందముతో తమతమ యిళ్ళకు తిరిగి వెళ్ళిరి. ★

---

Regd. No. H/KD—45/KD H.O

*From*
SATYA WAKKU
P.O. Box 80
KAKINADA 533 001

No.

To

..............................................
..............................................
..............................................
..............................................